## క్లుప్తంగా

### గండిమాసానిపేటలో వైద్య శిబిరం



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని గండిమాసానిపేటలో ఆదివారం జీవదాన్ ఆస్పత్రి ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గ్రామంలో 200 మందికి ఉచితంగా వైద్య పరీక్షలను నిర్వహించి మందులను అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మెన్ సుజాత, జీవదాన్ ఆస్పత్రి వైద్యులు తదితరులున్నారు.

### ఘనంగా షబ్ ఏ ఖదర్



పిట్లం(జుక్కల్) : రంజాన్ పండగను పురస్కరించుకొని మండల కేంద్రంలోని జామ మసీద్‌లో శనివారం రాత్రి షబ్ ఏ ఖదర్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ముఖ్య అతిథిగా హైదరాబాద్‌కు చెందిన మౌలానా ముఫ్తీ మహ్మద్ అబ్దుల్ రెహ్మాన్ ఖురేషి పాల్గొని ప్రసంగించారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతర మజీత్ కమిటీ ఆధ్వర్యంలో ముఖ్య అతిథిలకు, మౌలానాలకు సన్మానం చేశారు.

### ఏఎస్ఆర్ ఫౌండేషన్ కమిటీ ఎన్నిక



పిట్లం(జుక్కల్) : మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఏఎస్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అయ్యల సంతోష్ ఆధ్వర్యంలో ఏఎస్ఆర్ ఫౌండేషన్ పిట్లం మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా హనుమ ప్రవీణ్, ప్రధాన కార్యదర్శిగా బత్తిని పవన్, కోశాధికారిగా చాకలి పండరీ, ఉపాధ్యక్షుడిగా రాకేష్ ముదిరాజ్, శివ, సహాయకార్యదర్శిగా హనుమ అజయ్, అఖిల్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా షేక్ జహంగీర్, సాయి, గోవింద్ సింగ్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఆర్ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు బంగారు రవి, నాయకులు బొప్పని శ్రీనివాస్ తదితరులున్నారు.

### పదేళ్లలో అభివృద్ధి శూన్యం



ఎల్లారెడ్డి : జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ ఈ ఎన్నికల్లో ఇంటికి సాగనంపుతామని ఎల్లారెడ్డి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కుర్మ సాయిబాబా అన్నారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పదేళ్లలో ఎంపీ బీబీ పాటిల్ నియోజకవర్గాన్ని ఎలాంటి అభివృద్ధి చేయలేదన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నాగంగోపి, విద్యాసాగర్, సామెల్, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్రాంరెడ్డి తదితరులున్నారు.

### ఇంటింటికీ బీఆర్ఎస్ ప్రచారం



బిచ్కుంద(జుక్కల్) : మండలంలోని గోపన్‌పల్లి, ఖండేబల్లూర్, బిచ్కుంద ఆయా గ్రామాల్లో ఆదివారం బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. జహీరాబాద్ ఎంపీగా బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్ కుమార్‌ను గెలిపించాలని ప్రచారం చేశారు. ఎంపీపీ అశోక్, బీఆర్ఎస్ నాయకులు రాజు, హన్మాండ్లు తదితరులు పాల్గొన్నారు.

### రంజాన్ కిట్ల అందజేత



రాజంపేట : రాజంపేట గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ బల్ల ఆంజనేయులు ఆదావారం ముస్లింలకు రంజాన్ సామగ్రిని అందజేశారు. గ్రామంలోని సుమారు 150 కుటుంబాలకు పండగ సామగ్రిని అందజేసినట్లు ఆయన తెలిపారు. 20ఏళ్లుగా ముస్లిం కుటంబాలకు ఇఫ్తార్ విందు, పండుగ సామగ్రి అందజేస్తున్నానన్నారు.

# ప్రశాంతంగా మోడల్ ప్రవేశ పరీక్ష

- హాజరైన విద్యార్థులు
- ఏర్పాట్లు చేసిన విద్యాశాఖ



సదాశివనగర్‌లో పరీక్ష రాసి వస్తున్న విద్యార్థులు



ఎల్లారెడ్డి మోడల్ స్కూల్‌లో విద్యార్థులను తనిఖీ చేస్తున్న ఉపాధ్యాయులు

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : ఎల్లారెడ్డి మోడల్ స్కూల్ ప్రవేశపరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసినట్లు పాఠశాల ప్రిన్సిపల్ పుట్ట సాయిబాబా తెలిపారు. 6వ తరగతి వారికి ఉదయం, 7 నుంచి 10వ తరగతి విద్యార్థులకు మధ్యాహ్నం ప్రవేశ పరీక్ష నిర్వహించామన్నారు. 218 మంది విద్యార్థులకు గాను 30 మంది విద్యార్థులు గైర్హాజరైట్లు ఆయన తెలిపారు.

**సదాశివనగర్‌లో..**

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన మోడల్ స్కూల్ ఎంట్రెన్స్ పరీక్ష ప్రశాంతంగా ముగిసినట్లు ప్రిన్సిపాల్ భానుమతి తెలిపారు. 6వ తరగతిలో వంద సీట్లకు గాను 536 మంది విద్యార్థులు దరఖాస్తులు చేసుకోగా 490 మంది పరీక్షలు రాసినట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాన్ని డీఈవో రాజు తనిఖీ చేశారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు 7–10వ తరగతుల్లో ప్రవేశం కోసం 528 మంది విద్యార్థులు దరఖాస్తులు చేసుకోగా 464 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు తెలిపారు. చీఫ్ సూపరింటెండెంట్లు భానుమతి, విష్ణువర్ధన్ రెడ్డి, దామోదర్ రెడ్డి, డిపార్ట్‌మెంట్ అధికారులుగా విష్ణువర్ధన్, అనిల్, లింగమయ్య విధులు నిర్వర్తించినట్లు తెలిపారు.

**నిజాంసాగర్‌లో..**

నిజాంసాగర్(జుక్కల్) : మండలంలోని అచ్చంపేట ఆదర్శ(మోడల్) పాఠశాల ప్రవేశ పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. అచ్చంపేట మోడల్ పాఠశాలలో పరీక్ష నిర్వహించామని ప్రిన్సిపాల్ చంద్రకళ తెలిపారు. 6వ తరగతి ప్రవేశానికి 206 మంది విద్యార్థులు దరఖాస్తులు చేసుకోగా 182 మంది ప్రవేశ పరీక్షకు హాజరయ్యారన్నారు. 7వ తరగతి నుంచి పదోతరగతి వరకు 141 మంది దరఖాస్తు చేసుకోగా 117 మంది పరీక్ష రాశారని ప్రిన్సిపాల్ తెలిపారు.



అచ్చంపేటలో..

**బాన్సువాడ రూరల్‌లో..**

బాన్సువాడ రూరల్ : మండలంలోని కొత్తాబాది మోడల్‌స్కూల్‌లో ఆదివారం 2024–25 విద్యాసంవత్సరంలో ప్రవేశం కోసం విద్యార్థులకు నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. 6వ తరగతిలో ప్రవేశం కోసం నిర్వహించిన ప్రవేశ పరీక్షకు 699 మందికి గాను 619మంది హాజరైనట్లు ప్రిన్సిపల్ ఫకీరయ్య తెలిపారు. మధ్యాహ్నం 7 నుంచి 10 తరగతి వరకు మిగులు సీట్లకు అర్హత పరీక్ష నిర్వహించామన్నారు.

# ఆరు గ్యారంటీల పేరిట గారడీ

- రైతుల నోట్లో మట్టికొడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం
- కామారెడ్డి బీఆర్ఎస్ ఇన్‌చార్జి, మాజీ ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్



మాట్లాడుతున్న బీఆర్ఎస్ కామారెడ్డి ఇన్‌చార్జి మాజీ ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్

భిక్కనూరు : అమలుకు సాధ్యం కాని హామీలు ఇచ్చిన సీఎం రేవంత్ రెడ్డి ప్రస్తుతం వాటిని నెరవేర్చలేక ఇబ్బందుల పాలవుతున్నాడని, గప్పాలు పలికిన గుంపు మేస్త్రి రేవంత్‌రెడ్డి అని మాజీ ఎమ్మెల్యే, మాజీ ప్రభుత్వ విప్, కామారెడ్డి బీఆర్ఎస్ ఇన్‌చార్జి గంప గోవర్ధన్ అన్నారు. ఆదివారం భిక్కనూరు మండల కేంద్రంలో రాజంపేట, భిక్కనూరు మండలాల బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీల పేరిట గారడి చేసి ప్రజలను తికమక చేసి పబ్బం గడుపుకుందన్నారు. పంటలకు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి ఇవ్వకుండా రైతుల నోట్లో కాంగ్రెస్ ప్రభుత్వం మట్టికొడుతుందన్నారు. అధికారంలోకి వచ్చిన రెండు రోజుల్లోనే రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి, ఇప్పుడు ఎందుకు స్పందించడం లేదన్నారు. అకాల వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ. 10వేలు ప్రకటించిన ప్రభుత్వం ఇప్పటివరకు ఆ దిశగా చర్యలు తీసుకున్న పాపాన పోలేదన్నారు. భిక్కనూరు ఎంపీపీని బీఆర్ఎస్ ఎంపీటీసీగా గెలిపించి ఎంపీపీగా గెలిపిస్తే కాంగ్రెస్ పార్టీకి అమ్ముడుపోయారన్నారు. ఆత్మకమిటీ చైర్మన్ నర్సింహారెడ్డి ఎన్నికల ఖర్చుల వివరాలు ఎక్కడ అడుగుతారోనని కాంగ్రెస్ పార్టీలో చేరాడన్నారు. ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణరెడ్డి రూ. 150 కోట్ల సొంత మానిఫెస్టో అంటూ ప్రజలకు మా యమాటలు చెప్పారన్నారు. బీబీపాటిల్‌ను కేసీఆర్ రెండు పర్యాయాలు జహీరాబాద్ ఎంపీగా గెలిచి ప్రస్తుతం బీజేపీలో చేరాడన్నారు. మండలంలో ఓ నాయకుడు బీఆర్ఎస్ నేతలపై జులూం చేస్తున్నాడని పద్ధతి మార్చుకోకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కార్యకర్తలు శ్రమించి పార్టీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌ను గెలిపించాలని గోవర్ధన్ పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో జహీరాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్, రాజంపేట మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు బల్వంత్‌రావు, భిక్కనూరు మండల ప్రధానకార్యదర్శి అత్తెల్లి శ్రీనివాస్, కామారెడ్డి ఎంపీపీ పిప్పిరి అంజనేయులు విండో చైర్మన్‌లు నళ్ల వెల్లి అశోక్, భూంరెడ్డి, రాజాగౌడ్, వెంకట్‌రెడ్డి,ఎంపీటీసీల ఫోరమ్ మండల కన్వీనర్ ద్యావర సాయిరెడ్డి, నేతలు అందె మహేందర్‌రెడ్డి,అంద్యాల రమేశ్ తదితరులున్నారు.

# బీబీ పాటిల్‌ను చిత్తుగా ఓడించాలి



మాట్లాడుతున్న సంగారెడ్డి

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : ఎంపీ బీబీ పాటిల్ తన ఆస్తులను కాపాడుకునేందుకే బీఆర్ఎస్ నుంచి బీజేపీలోకి వెళ్లాడని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు జూకంటి సంగారెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్‌లో పదేళ్ల ఎంపీగా ఉండి ఒక్క గ్రామాన్ని సందర్శించిన దాఖలాల్లేవన్నారు. పార్లమెంట్ సమావేశాల్లో కూడా సమస్యలపై ఏనాడు కూడా స్పందించలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ తరపున బరిలో ఉన్న ఎంపీ అభ్యర్థి సురేశ్ షెట్కార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గాదారి శ్రీనివాస్ రెడ్డి, సేవాదల్ అధ్యక్షుడు బొంబోతుల లింగాగౌడ్, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు బాగయ్య, మాజీ వైస్ ఎంపీపీ రూపెందర్ రెడ్డి, విండో చైర్మన్లు తదితరులున్నారు.

### బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులను నిలదీయండి



భిక్కనూరు : తాము అధికారంలో ఉన్నప్పుడు పార్లమెంట్ నియోజకవర్గం అభివృద్ధి నిధులను కూడా ఉపయోగించకుండా అభివృద్ధి చేయని బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్, కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ షెట్కార్‌ను నిలదీయాలని బీఆర్ఎస్ జహీరాబాద్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం భిక్కనూరు మండల కేంద్రంలో జరిగిన భిక్కనూరు, రాజంపేట మండలాల బీఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

# కాంగ్రెస్‌లో పలువురి చేరిక



షబ్బీర్ అలీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న బీబీపేట బీఆర్ఎస్ నాయకులు



దోమకొండ నుంచి..

బీబీపేట : హైదరాబాద్ గాంధీభవన్‌లో ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్, ఏఐసీసీ నేషనల్ సెక్రటరీ రోహిత్ చౌదరి, జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి సురేష్ శెట్కార్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. డీసీఎంఎస్ వైస్ ప్రెసిడెంట్ ఏదుల్ల ఇంద్రసేనారెడ్డి బీబీపేట మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ వెంకట్ గౌడ్, బిబిపేట్ మండల వైస్ ఎంపీపీ కే. రవీందర్ రెడ్డి, రెడ్‌క్రాస్ మండల చైర్మన్, మాజీ సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, బీఆర్ఎస్ గ్రామాధ్యక్షులు కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బద్దం ఇంద్రకరణ్ రెడ్డి, బీబీపేట మండల అధ్యక్షులు సుతారి రమేష్, భూమా గౌడ్, రాంచంద్రా రెడ్డి తదితరులున్నారు.

**దోమకొండ మండలం నుంచి..**

దోమకొండ : మండలానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఆదివారం పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. గాంధీభవన్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మాజీ మంత్రి షబ్బీర్ అలీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి రోహిత్ చౌదరి, జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి సురేష్‌షెట్కార్ ఆధ్వర్యంలో వీరి కాంగ్రెస్ పార్టీలో చేరారు. మాజీ సర్పంచ్‌లు పోగులు సాయిలు, సంజీవ్‌రెడ్డి, స్వామిగౌడ్, సార్ల నర్సింలు, జనార్ధన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యులు మైసయ్య, సత్తాగౌడ్‌సింగిల్‌విండో చైర్మన్ పన్యాల నాగరాజ్‌రెడ్డి, డైరెక్టర్లు పార్టీలో చేరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు తీగల తిర్మల్‌గౌడ్, సీనియర్ నాయకులు రామస్వామిగౌడ్, అబ్రబోయిన స్వామి, ఫిరంగి రాజేశ్వర్ తదితరులు ఉన్నారు.

**బాన్సువాడ రూరల్ నుంచి..**

బాన్సువాడ రూరల్ : మండలంలోని హన్మాజీపేట్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు సింగం సంతోష్ ఆదివారం కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షులు కైలాస్ శ్రీనివాస్‌రావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. సింగం సంతోష్‌తో పాటు నాయకులు సాలె లచ్చయ్య, బోడ పోశెట్టి, గడీల శంకర్‌తో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు.



కాంగ్రెస్‌లో చేరుతున్న హన్మాజీపేట్ గ్రామ కమిటీ అధ్యక్షుడు సంతోష్

## ఆధ్యాత్మికం

### వైభవంగా బీరప్ప ఆలయ ప్రారంభోత్సవం



మద్నూర్(జుక్కల్) : మండల కేంద్రంలో నూతనంగా నిర్మాణం పూర్తి చేసుకున్న బీరప్ప ఆలయ ప్రారంభోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని అర్చకులు ఘనంగా నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి బీరప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోతరాజులు ఆలయం వద్ద భక్తి శ్రద్ధలతో చేసిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. అనంతరం అన్నదానం చేశారు.

### భక్తిశ్రద్ధలతో నరసింహ యజ్ఞం



కామారెడ్డి అర్బన్ : అంతర్జాతీయ శ్రీకృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) కామారెడ్డి శాఖ 8వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక రామారెడ్డి రోడ్డులోని ఇస్కాన్ కేంద్రంలో భక్తిశ్రద్ధలతో శ్రీనరసింహ మహాయజ్ఞం, హరినామ సంకీర్తన, నరసింహ ప్రణామమంత్రం అనంతరం యజ్ఞఫల, అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఇస్కాన్ ప్రతినిధులు సిద్ది బలరాం ప్రభు, వెంకటదాస్ ప్రభు, రాంబాబు ప్రభు, శ్రీనివాస్ భక్త బృందం, శ్రీరామకోటి జప లిఖిత ప్రచారకులు కృష్ణానందస్వామి పాల్గొన్నారు.

## సమాచారం..

### నేడు ఇఫ్తార్

బిచ్కుంద(జుక్కల్) : మండలంలోని పత్లాపూర్ నేషనల్ హైవే గెస్ట్ హౌస్ పక్కన ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు సోమవారం ఇఫ్తార్ ఏర్పాటు చేసినట్లు కాంగ్రెస్ మైనారిటీ నాయకులు షేక్ లతీఫ్ పాషా తెలిపారు. జుక్కల్ నియోజకవర్గంలోని ముస్లింలు తదితరులు సాయంత్రం 6గంటలకు హాజరు కావాలని కోరారు.

### రేపటి నుంచి అక్కమ్మ నాటక ప్రదర్శన

బాన్సువాడ రూరల్ : తెలుగు నూతన సంవత్సరాది ఉగాది మహోత్సవాలను పురస్కరించుకుని మండలంలోని హన్మాజీపేట్ గ్రామంలో మంగళవారం రాత్రి నుంచి అక్కమ్మ వీధినాటక ప్రదర్శన నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. అంతరించిపోతున్న కళలు, సాహిత్యానికి పునరుజ్జీవం పోసే ప్రయత్నాన్ని ప్రజలు ఆదరించి ప్రోత్సహించాలని కోరారు. 3 రోజుల పాటు కొనసాగే నాటక ప్రదర్శనను గ్రామస్తులు తిలకించాలని కోరారు.

### భారీమెజార్టీ లక్ష్యంగా కృషిచేయాలి



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : రాబోయే ఎంపీ ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలు కలసి భారీ మెజార్టీతో సురేశ్‌షెట్కార్‌ను గెలిపించేందుకు అందరు కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి అన్నారు. తాడ్వాయి మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. బీబీపాటిల్ పదేళ్లుగా ఎంపీగా ఉండి ఎలాంటి అభివృద్ధి చేయలేదన్నారు. ఈ సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడు అకిల్‌రావు, నాయకులు మహేందర్‌రెడ్డి, జంగంరాజు తదితరులున్నారు.

### కల్వర్టును పునర్నిర్మించాలి



బాన్సువాడ రూరల్ : బాన్సువాడ–బోర్లం రోడ్డులో డిపోవద్ద కూలిపోయిన కల్వర్టును అధికారులు వెంటనే తిరిగి నిర్మించాలని బోర్లం గ్రామస్తులు కోరుతున్నారు. రోడ్డును వెడల్పు చేసి బీటీరోడ్డుగా మార్చినప్పుడు నిర్మించిన కల్వర్టు ముణ్ణాళ్ల ముచ్చటగా మారిందని, కల్వర్టు కూలిపోయి భారీగుంట ఏర్పడటంతో ప్రమాదాలను నివారించడానికి పోలీసులు బారికేడ్‌ను అడ్డంగా పెట్టారన్నారు. ప్రస్తుతం పెళ్ళిళ్లు, వరికోతలు, ధాన్యం కాంటాల పనులు కొనసాగుతుండటంతో బాన్సువాడకు ధాన్యం బస్తాలు తరలించే ట్రాక్టర్లు, లారీలు, టూరిస్ట్ బస్సులు ఈ రోడ్డు గుండా రవాణా చేయలేకపోతున్నారు.

# ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వ పూర్తిగా విఫలమైందని ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురెందర్ అన్నారు. తాడ్వాయి మండల కేంద్రంలో మాగార్డెన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన తాడ్వాయి, రాజంపేట్ మండలాల బీఆరెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశానికి హాజరై మాట్లాడారు. మోసపూరితమైన హామీలు ఇచ్చి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. అందరికీ అందుబాటులో ఉండే గాలి అనిల్‌కుమార్‌ను గెలిపించాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జనార్దన్‌గౌడ్, డీసీఎంఎస్ డైరెక్టర్ కపిల్‌రెడ్డి, మార్కెట్‌కమిటీ చైర్మన్ సాయిరెడ్డి, జెడ్పీటీసీ హన్మాండ్లు, వైస్ ఎంపీపీ నర్సింలు తదితరులున్నారు.

# బీజేపీ, బీఆర్ఎస్ రెండూ ఒక్కటే..



షబ్బీర్ అలీకి పండ్లు తినిపిస్తున్న నాయకులు

బాన్సువాడ : రాష్ట్రంలో బీఆర్ఎస్–బీజేపీ రెండు పార్టీలు ఒక్కటేనని, ఎవరికి ఓటేసి అది బీజేపీకే వెళ్తుందని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఓబీసీ ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ అన్నారు. ఆదివారం బాన్సువాడలోని భారత్ గార్డెన్ వద్ద నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తామని, త్వరలో రైతులకు రుణమాఫీ చేస్తామన్నారు. ఎంపీలను భారీ మెజార్టీలతో గెలిపించి రాహుల్‌గాంధీని పీఎం చేయాలని పిలుపు నిచ్చారు. అనంతరం దావతే ఇఫ్తార్‌లో షబ్బీర్ పాల్గొన్నారు. ఎంపీగా తనను గెలిపిస్తే బోధన్–బీదర్ రైల్వేలైన్‌కు కృషి చేస్తానని ఎంపీ అభ్యర్థి సురేష్ షెట్కార్ అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అండదండలతో జహీరాబాద్ పార్లమెంట్ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

### కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇఫ్తార్



ప్రార్థన చేస్తున్న ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

నిజాంసాగర్(జుక్కల్) : మండల కేంద్రంలో ముస్లింలకు ఆదివారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు పార్టీకి జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు హాజరయ్యారు. ప్రార్థనలు చేశారు. ఇఫ్తార్‌లో పాల్గొన్నారు. నాయకులు జయప్రదీప్, మల్లికార్జున్, రవీందర్‌రెడ్డి తదితరులున్నారు.

పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని భారత్ గార్డెన్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం మైనార్టీ సోదరుల కోసం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఇఫ్తార్ విందులో ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావ్, జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి సురేష్ షెట్కార్ పాల్గొన్నారు. రాంరెడ్డి, మోహన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శివ, శప్దంరెడ్డి, మైనార్టీ నాయకులు షేక్ నజీర్, నయిం, కరీం, మోయిన్ తదితరులున్నారు.

## సంక్షిప్తం

### అంత్యక్రియలకు ఆర్థికసాయం

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని పొల్కంపేట గ్రామానికి చెందిన బాసని దుర్గయ్య అనారోగ్యంతో మృతిచెందాడు. మృతుని కుటుంబ సభ్యులకు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పద్మ భర్త అంత్యక్రియల కోసం రూ. 5 వేల ఆర్థిక సాయం అందజేశారు. కాంగ్రెస్ నాయకులు ఎల్లయ్య, పోచయ్య, రాము, నవీన్, సిద్ధిరాములు పాల్గొన్నారు.

### డిగ్రీ వన్‌టైం చాన్స్‌ను వినియోగించుకోవాలి

బాన్సువాడ రూరల్ : ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో డి గ్రీ చదివి ఫెయిలైన పూర్వ విద్యార్థులు తిరిగి ఫీజు చెల్లించి, పరీక్ష రాసుకునేందుకు అనుమతులొచ్చాయని ఎస్ఆర్ఎన్‌కే ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపల్ గంగాధర్ తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీ ఇతర డిగ్రీకోర్సుల్లో 2000 నుంచి 2019 వరకు ఫెయిలైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గతంలో ఒక్కో సబ్జెక్ట్‌కు రూ.10 వేలు ఫీజు ఉండగా దాన్ని రూ. 2 వేలకు తగ్గించారని, ఈ నెల 15వరకు ఫీజు చెల్లించడానికి అవకాశం ఉందన్నారు.

### బాన్సువాడ ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గం

బాన్సువాడ : బాన్సువాడ ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సుధాకర్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా అశ్వక్, గుండోబా శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా గంట చంద్రశేఖర్, సహాయ కార్యదర్శిలుగా నరేష్‌గౌడ్, అరుణ్‌రెడ్డి, కోశాధికారిగా నుగురు శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులుగా బొగ్గుల శ్యాంసుందర్, జాకీర్, హన్మండ్లు, సతీష్, ఇలియాస్, మోహన్‌లను ఎన్నుకున్నారు.

### కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



భిక్కనూరు : ప్రధాని మోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ఇంటింటా ప్రచారం చేసి బీజేపీకీ ఓటు వేయాలని ప్రజలను అభ్యర్థించాలని బీజేపీ మండల ఇన్‌చార్జి శ్రీధర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన భిక్కనూరు మండల కేంద్రంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కామారెడ్డి ఎమ్మెల్యేగా కేవీఆర్‌ను గెలిపించిన విధంగానే బీజేపీ జహీరాబాద్ అభ్యర్థిగా బీబీపాటిల్‌ను గెలిపించాలని సూచించారు. బీజేపీ మండల అధ్యక్షుడు ఉప్పరి రమేష్, నేతలు గరిగంటి నర్సింలు, నరేందర్‌రెడ్డి, రాంరెడ్డి,రాజశేఖర్‌లు పాల్గొన్నారు.

### దాతకు సన్మానం

భిక్కనూరు : మండలంలోని శ్రీ వేంకటేశ్వారాలయం అభివృద్ధికి నాగోల్‌కు చెందిన కంకణి శ్రీనివాస్–లక్ష్మి గిరజ రూ. 5,121 ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా విరాళ దాతను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ తాటిపల్లి సిద్దరాములు, ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు కుంట లింగారెడ్డి, వైద్యుల లక్ష్మణ్‌రావు, కాశీనాథ్‌రావు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా గణేశ్ నాయక్



సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మండలంలోని యాచారానికి చెందిన గణేశ్ నాయక్‌ను మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా ఎన్నుకున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు జూకంటి సంగారెడ్డి తెలిపారు.